సాక్షి ఖమ్మం

బుధవారం । 6 డిసెంబర్ । 2023



చేదోడు.. వాదోడు

పోలీసుశాఖకు చేదోడు, వాదోడుగా ఉంటున్న హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణలో పాలు పంచుకుంటున్నారు. 8లో



'ఉపా' చట్టాన్ని ఎత్తివేయాలి

ప్రజల కోసం పోరాడుతున్న వారిపై నమోదు చేస్తున్న 'ఉపా' చట్టాన్ని ఎత్తివేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
26° / 22°

వాతావరణం

జిల్లా అంతటా బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురుస్తుంది.

దంచి కొట్టిన వాన

జిల్లాపై 'మిచాంగ్' ప్రభావం

- రోజంతా ఆగకుండా కురిసిన వర్షం
- పంటలపై కోలుకోలేని దెబ్బ
- పొలాల్లోనే తడిసిముద్దయిన వరి, పత్తి
- కల్లాల్లో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతుల కన్నీరు
- కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న కలెక్టర్, యంత్రాంగం



ఏన్కూరు : ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేను



వైరా రూరల్: రహదారిపై ఆరబోయగా తడిచిన ధాన్యం రాశులు



నేలకొండపల్లి : ధాన్యం రాశిలో నీరు తొలగిస్తున్న రైతు



కొణిజర్ల : వానకు తడిచిన పత్తి చేను

ఖమ్మంవ్యవసాయం: మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాపై పడింది. సోమవారం సాయంత్రం మొదలైన వాన మంగళవారం ఉదయం కాస్త నెమ్మదించినట్లు కనిపించినా.. మళ్లీ మొదలై రాత్రి వరకు దంచి కొట్టింది. ఈ వర్షం కారణంగా పత్తి, వరి పంటలకు తీరని నష్టం వాటిల్లగా కల్లాలు, మార్కెట్లలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఇక పత్తి చేన్లలోనే తడవడంతో నాణ్యత కోల్పోయి మద్దతు ధర దక్కే పరిస్థితి కానరావడం లేదు. అలాగే, ఎడతెరిపి లేనివానతో జిల్లావ్యాప్తంగా జన జీవనం స్తంభించింది. నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో వానకు గోడలు తడిసి కుప్పకూలడంతో ఇంట్లో నిద్రిస్తున్న భార్యాభర్తలు పుల్లారావు– లక్ష్మి కన్నుమూశారు.

పంటలకు తీవ్ర నష్టం

మిచాంగ్ తుపాను పత్తి రైతులను నట్టేట ముంచింది. ప్రస్తుతం పత్తితీత సమయం కాగా, ఈదురు గాలులు, వానతో పత్తి నేలరాలింది. అలాగే, రంగు మారి నాణ్యత కోల్పోవడమే కాక కాయలోకి నీరు దిగి పత్తి నల్లబడింది. తద్వారా పత్తి తీత కూడా ఇబ్బందేనని, ఫలితంగా దిగుబడి కోల్పోయిన తమకు మద్దతు ధర కూడా దక్కే అవకాశం లేదని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అలాగే, వరి కోత, నూర్పిడి దశలో ఉండగా, పలు ప్రాంతాల్లో కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టారు. చాలాచోట్ల ధాన్యంపై పట్టాలు కప్పినా రాశుల్లోకి నీరు చేరడంతో రైతులు కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు. మరోపక్క కోత దశలో ఉన్న వరి ఈదురుగాలుల కారణంగా నేల వాలుతోంది. కాగా, ఈదురుగాలులు, తుపాను కారణంగా కాత దశలో ఉన్న మిర్చి పైర్లు సైతం నేలవాలే ప్రమాదం ఉంది. తేమ కారణంగా కాయకు నల్లమచ్చ ఆశించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

నష్టం వివరాలు నివేదించండి

తుపాను కారణంగా జరిగిన, జరుగుతున్న పంట నష్టంపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని వ్యవసాయ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఉద్యోగులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల మంగళవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైసూచనలు చేశారు. అలాగే, పంటలు నష్టపోకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

నాలుగు మండలాల్లో అప్రమత్తం

ఈ ఏడాది వానాకాలం జూలైలో వచ్చిన వరదలతో మున్నేరు ఉధృతి పెరిగి పలు ప్రాంతాలను ముంచెత్తింది. ఈ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవడంతోపాటు అధికారులు ప్రస్తుతం ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు, రైతులను బయటకు రావొద్దని ప్రకటించగా... వాయుగుండం కేంద్రీకృతమైన ప్రాంతానికి సమీపంగా ఉన్న ఎర్రుపాలెం, మధిర, వేంసూరు సత్తుపల్లి మండలాల్లో మరింతగా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మధిరలో అత్యధికం

తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం రాత్రి ఏడు గంటలకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మధిర మండల కేంద్రంలో అత్యధికంగా 72.5 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లోనూ ప్రభావం కనిపించింది. రోజంతా వర్షం కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు పడిపోయి చలిగాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాల నేపథ్యాన అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా బుధవారం కూడా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. మధిరలోని లోతట్టు ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, వివిధ శాఖల అధికారులు నర్సింగరావు, హరికిషన్, సోమశేఖరశర్మ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, వెంకటరామారావు, అరుణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

వేగంగా సహాయక చర్యలు

ఖమ్మం సహకారనగర్: మిచాంగ్ తుపాను నేపథ్యాన ముందస్తుగా సహాయక చర్యలు వేగవంతం చేసినట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను మంగళవారం ఆయన పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. ఆపదలో ఉన్నవారే కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు 1077, 90632 11298 నంబర్లకు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, సహాయ చర్యల కోసం రెండు ఇంఫ్లాటెడ్ రెస్క్యూ బోట్లను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విపత్తు ఎదురైతే సత్వరమే రంగంలోకి దిగేలా రూ.6లక్షల చొప్పున వెచ్చించి వీటిని కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలోని సత్తుపల్లి, మధిరకు వీటిని కేటాయించామని కలెక్టర్ తెలిపారు.



కంట్రోల్ రూమ్ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

మంగళవారం రాత్రి 7 గంటల వరకు నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

ప్రాంతం	వర్షపాతం
మధిర	72.5
మధిర (ఏఆర్ఎస్)	59.8
గంగారం	59.3
నాగులవంచ	56.0
సదాశివునిపాలెం	53.3
వేంసూరు	52.5
రావినూతల	48.5
సిరిపురం	42.5
పెనుబల్లి	32.8
పమ్మి	31.3
గుబ్బగుర్తి	30.8
పెద్దగోపతి	27.8
చింతకాని	27.8
వైరా (ఏఆర్ఎస్)	26.5
నేలకొండపల్లి	26.3
ఖానాపురం	22.3
కొణిజర్ల	21.5
తిరుమలాయపాలెం	19.8
ఏన్కూరు	19.5
కల్లూరు	18.8
పంగిడి	17.8
పల్లెగూడెం	17.8
కూసుమంచి	17.5

ప్రకృతి ప్రకోపం

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుండగా, అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాయుగుండం తీవ్రత ఆధారంగా వాతావరణ శాఖ జిల్లాకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగం ముందస్తుగా సహాయక చర్యల్లో నిమగ్నమైంది. ఇప్పటికే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేయగా కలెక్టర్ గౌతమ్ అధికారులతో సమావేశమై సహాయక చర్యలను సమీక్షించారు. ఎక్కడైనా వరదల్లో ప్రజలు చిక్కుకుంటే కాపాడేందుకు బోట్లు సమకూర్చి సిబ్బందిని సన్నద్ధం చేశారు.

ముగ్గురికి యోగం!



ఉమ్మడి జిల్లాలో అమాత్య పదవిపై అంచనాలు

- భట్టికి డిప్యూటీ సీఎం ఖాయమని ప్రచారం
- మంత్రుల రేసులో పొంగులేటి, తుమ్మల
- ధీమా వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, నేతల అభిమానులు
- ఇప్పటికే రాజధానికి చేరిన అనుచర వర్గం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 'మెజార్టీ' బలాన్ని ఇచ్చింది. పది స్థానాల్లో ఎనిమిదింట కాంగ్రెస్, పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సీపీఐ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లోనే కాక గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన ఉమ్మడి జిల్లాకు ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్ని మంత్రి పదవులు దక్కుతాయనే అంశంపై చర్చ జరుగుతోంది. సామాజిక, రాజకీయ సమీకరణాల్లో మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయోనని కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ఖరారు కావడంతో... మంత్రి పదవులపై ప్రధాన నేతల అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొందరు తమ ఎమ్మెల్యేల వెంట హైదరాబాద్ వెళ్లారు. మధిర నుంచి విజయం సాధించిన మల్లు భట్టివిక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి దక్కుతుందని ఆయన అనుచర నేతలు ధీమాగా ఉన్నారు. అలాగే, పాలేరు, ఖమ్మం నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవులు ఖాయమని వారి అనుచర గణం చెబుతోంది. అయితే భట్టి, పొంగులేటిని మంత్రి వర్గంలోకి తీసుకుంటే తుమ్మలకు స్పీకర్ పదవి ఇస్తారనే ప్రచారమూ ఉంది. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులు, సీపీఐ అభ్యర్థి గెలుపు విషయంలో భట్టి, పొంగులేటి, తుమ్మల కీలక పాత్ర పోషించిన నేపథ్యాన కాంగ్రెస్ అధిష్టానం ఈ ముగ్గురికి ప్రాధాన్యత ఇవ్వనుంది.

సీనియర్ నేతగా తుమ్మల

ఖమ్మం నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావు సైతం మంత్రి రేసులో ఉన్నారు. నలభై ఏళ్లుగా రాజకీయాల్లో ఉండటం, గతంలో మంత్రి పదవిని నిర్వహించిన అనుభవం ఉన్నందున ఈసారి కూడా మంత్రి పదవి వస్తుందని భావిస్తున్నారు. అయితే, ఉమ్మడి జిల్లా నుంచి భట్టి, పొంగులేటిని మంత్రి వర్గంలోకి తీసుకుంటే, తుమ్మలకు స్పీకర్ పదవి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా బీఆర్ఎస్ నుంచి నాయకులు, కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో తుమ్మల చురుకైన పాత్ర పోషించడమే కాక ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం కూడా చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అనుచరులు, అభిమానులు ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించడంలో ప్రముఖంగా వ్యవహరించారు. వీటన్నింటినీ బేరీజు వేసుకొని తుమ్మల పేరును కూడా అధిష్టానం పరిగణనలోకి తీసుకోనుంది.

కాంగ్రెస్‌లో హుషారు

కాంగ్రెస్ పార్టీ కేడర్‌లో జోష్ నెలకొంది. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి శ్రేణులు సంబరాల్లో మునిగారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఫలితాలు రావడం ప్రారంభమైనప్పటినుంచే ఆ పార్టీ కార్యకర్తలు హడావుడి చేయగా.. పార్టీ కార్యాలయాల వద్ద బాణాసంచా కాలుస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాకు గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వంలో ప్రాధాన్యం దక్కుతుందనే ఉద్దేశం వ్యక్తమవుతోంది. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కానీ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కానీ ఒకే మంత్రి పదవితోనే సరిపెట్టారు. ఈసారి మాత్రం ఎక్కువ మంత్రి పదవులు దక్కుతాయని కార్యకర్తలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

'భట్టి'కి ప్రధాన పదవి

మధిర అసెంబ్లీ స్థానం నుంచి మల్లు భట్టి విక్రమార్క వరుసగా నాలుగు సార్లు గెలుపొందారు. ఈక్రమంలో ఆయనకు ప్రభుత్వంలో ప్రధాన పదవి దక్కుతుందనే అభిప్రాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల్లో ఉంది. ఎన్నికల సమయంలోనూ భట్టి తనను గెలిపిస్తే మంచి పదవి దక్కుతుందని వ్యాఖ్యానించారు. పార్టీ అధిష్టానం పిలుపుతో ఎన్నికల ముందు ఆయన రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పాదయాత్ర కూడా చేశారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఖరారైన నేపథ్యాన భట్టికి డిప్యూటీ సీఎం పదవి ఖాయమని తెలుస్తోంది.

చక్రం తిప్పిన పొంగులేటి

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌ను గట్టిగా ఎదుర్కోవడంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన విస్తృత ప్రచారం చేశారు. పాలేరు నుంచి బరిలోకి దిగిన ఆయన సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై 56వేలకు పైచిలుకు మెజార్టీతో ఘనవిజయం సాధించారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్‌గా జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కూడా పొంగులేటి ప్రచారం చేశారు. ఇక బీఆర్ఎస్ నుంచి పలువురిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో కృతకృత్యులయ్యారు. బీఆర్ఎస్ నుంచి ఒక్కరినీ అసెంబ్లీ గేటు దాటనివ్వబోనంటూ చాలెంజ్ చేసి కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపిన పొంగులేటి... ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. వీటన్నింటి దృష్ట్యా పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కూడా మంత్రి పదవి దక్కుతుందని ఆ పార్టీ కార్యకర్తలు, ఆయన అభిమానులు ధీమాతో ఉన్నారు.

న్యూస్‌రీల్

ఈనెల 30న జాతీయ లోక్‌అదాలత్

ఖమ్మంలీగల్: ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా తెలిపారు. రెండో శనివారమైన ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాలని తొలుత నిర్ణయించినా, అసెంబ్లీ ఎన్నికల కారణంగా 30వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ముందస్తు లోక్ అదాలత్‌లు నిర్వహించి అధికసంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కుటుంబ తగాదా కేసులు, బీమా కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, క్రిమినల్ పిటీ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశముంటుందని పేర్కొన్నారు.

డయల్ 100కు 4,223 ఫోన్లు

ఖమ్మంక్రైం: శాంతిభద్రతలను పర్యవేక్షించేలా ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు నవంబర్‌లో 4,223 మంది ఫోన్ చేశారని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఇందులో 57 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. అయితే, పలువురు అవగాహన లేక ఫోన్లు చేస్తున్నారని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు.

జాతీయ స్థాయికి జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు,



ఎగ్జిబిట్‌తో బాలాజీ, అనిల్‌రెడ్డి

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు 'త్రివేణి' విద్యార్థుల ఎగ్జిబిట్

ఖమ్మం సహకారనగర్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్(ఎన్‌సీఎస్‌సీ)కు ఖమ్మంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు టి.డార్విన్ బాలాజీ, అనిల్‌రెడ్డి 'సొల్యూషన్ టూ ది కన్జర్వేషన్ ఆఫ్ బయోడైవర్సిటీ ఫ్రమ్ ది గ్రానైట్ ఎగ్జాస్టర్స్' ప్రాజెక్టు ప్రదర్శించారు. ఈమేరకు ఎగ్జిబిట్‌ను పరిశీలించిన న్యాయనిర్ణేతలు జాతీయ స్థాయికి ఎంపికచేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ కంటెపుడి రోశయ్య, ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లును టీఎస్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ నగేష్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ అభినందించారు.

రాష్ట్ర స్థాయికి నాలుగు

గత నెల 22వ తేదీన జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించారు. ఇక్కడ ప్రదర్శించిన ఎగ్జిబిట్ల నుంచి నాలుగింటిని అధికారులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో నుంచి త్రివేణి విద్యార్థుల ఎగ్జిబిట్ జాతీయ స్థాయికి ఎంపిక కావటం విశేషం.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అంజనేయస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

తల్లాడ: తల్లాడలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి గంటా శ్రీలత, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన వారు కేంద్రానికి వచ్చి ఎన్ని రోజులైందో ఆరా తీశారు. అనంతరం తల్లాడలోని పలు రైస్ మిల్లులను కూడా వారు తనిఖీ చేశారు. కాగా, మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యాన్ని ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఏఈఓ గురుమూర్తి పరిశీలించారు.

'ఉపాధి'కి ప్రణాళికలు

- 2024-25లో ఈజీఎస్ పనులకు గతంలోనే మార్గదర్శకాలు
- ఎన్నికల కారణంగా నిలిచిన ప్రక్రియ
- మళ్లీ కసరత్తు మొదలుపెట్టిన అధికారులు?

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులపై అధికారులు ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. 2024–25 ఏడాదికి గాను జిల్లాలో అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించేలా, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళిక తయారు చేయాలని ఆదేశాలు అందాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన గ్రామాల్లో పనుల గుర్తింపు, గ్రామసభల్లో ఆమోదం వంటివి జరగలేదు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సిద్ధం చేయాల్సిన ఉపాధి ప్రణాళికల్లో జాప్యం జరుగుతోంది. తాజాగా ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యాన ప్రణాళిక సిద్ధం చేయడంపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

పనుల గుర్తింపునకు ప్రణాళిక

పేదల జీవన ప్రమాణాలు పెంచడం, వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు అమలుచేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 సంవత్సరానికి పనుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే షెడ్యూల్ జారీ చేసింది. ఇందులో భాగంగా అక్టోబర్ 2 నుంచి ప్రణాళికల తయారీ గ్రామసభలు, సర్వే, డాక్యుమెంట్ సిద్ధం చేసి ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా జనవరి 21లోగా పూర్తిచేయాలి. జిల్లాల నుంచి వచ్చిన ప్రణాళికలను ఫిబ్రవరి 10న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం కేంద్రానికి నివేదిస్తుంది. అయితే, అక్టోబర్, నవంబర్ నెలల్లో జరగాల్సిన పనులన్నీ ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి.

లేబర్ బడ్జెట్‌తో ప్రారంభం

గ్రామ సభల్లో పనులకు సంబంధించి కూలీల బడ్జెట్ ఖరారు చేసి.. అందుకు అనుగుణంగా పనులను గుర్తించాక గ్రామసభ ఆమోదం తీసుకోవాలి. అనంతరం ఈనెల 5వ తేదీ లోపు ఏపీఓ, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆమోదం కోసం మండల పరిషత్‌లకు పంపించాలి. కానీ గ్రామసభలు నిర్వహించకుండానే బడ్జెట్‌ను మండల అధికారులకు పంపిస్తున్నట్లు తెలిసింది. మండలంలో ఆమోదించిన పనులను డిసెంబర్ 20లోగా జిల్లా పరిషత్, వచ్చే ఏడాది జనవరి 21లోపు కలెక్టర్ ఆమోదం పొందాలి. అనంతరం రాష్ట్రప్రభుత్వానికి, అక్కడి నుంచి కేంద్రానికి ఆమోదం కోసం పంపిస్తారు. కానీ ఎన్నికల కారణంగా ఇదంతా షెడ్యూల్ ప్రకారం జరగలేదు. ఫలితంగా గ్రామసభల ఆమోదం లేకుండానే మండలాలకు పంపిస్తుండగా, మిగతా ప్రక్రియను ముందుగా జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం పూర్తిచేసేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.



జిల్లాలో ఉపాధి హామీ ఇలా...

జాబ్‌కార్డులు	3,04,657
కార్డుల్లోని కూలీలు	6,44,455
ఈ ఏడాది పని పొందిన కుటుంబాలు	1,22,752
పనికి వచ్చిన కూలీలు	1,92,601
ఈ ఏడాది పూర్తి చేసిన పనిదినాలు	39,42,222

క్లుప్తంగా

విద్యార్థుల బస్‌పాస్‌లు పాత బస్టాండ్‌లో...



పాత బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థులకు ఇంత కాలం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో బస్‌పాస్‌లు జారీ చేస్తుండగా ఈ కేంద్రాన్ని పాత బస్టాండ్‌కు మార్చినట్లు ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. అలాగే, రాయితీ, దివ్యాంగుల పాస్‌లు, నెలవారీ సీజన్ టికెట్లు, అడ్వాన్స్ రిజర్వేషన్ టికెట్లు కూడా పాత బస్టాండ్‌లోని కౌంటర్‌లో అందుబాటులోకి ఉంటాయని వెల్లడించారు.

ప్రజాదరణ కోల్పోతున్న మావోయిస్టులు

అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) సాయిమనోహర్

కొత్తగూడెంటౌన్: ప్రజాదరణ కోల్పోయిన మావోయిస్టులు ఉన్మాదుల్లా ప్రవర్తిస్తూ ఆదివాసులను, చిరు వ్యాపారులను దోచుకుంటున్నారని అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయి మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేస్తున్నామని మాయమాటలు చెబుతూ తమ స్వప్రయోజనాల కోసం ఆదివాసీలపైనే దాడులకు పాల్పడుతూ, చిరు వ్యాపారులను, ఆదివాసీలను దోచుకుంటున్నారని ఆరోపించారు. పనీపాట లేని కొంతమంది యువకులను ఆర్‌పీసీ కమిటీల పేరుతో నియమించి, తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీస్ ఇన్‌ఫార్మర్ల పేరుతో చిరు వ్యాపారులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. అమాయక ప్రజల వాహనాలను ఎత్తుకెళ్లి తగలబెట్టడం వంటి చర్యలతో బందిపోట్ల లాగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మావోయిస్టులను తమ గ్రామాల్లోకి రానివ్వకుండా, అడవుల్లో తిరగనివ్వకుండా బహిష్కరించాలని ఆదివాసీ ప్రజలకు పిలుపునిచ్చారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: తుపాను కారణంగా మంగళ, బుధవారం రెండు రోజుల పాటు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం మీదుగా వెళ్లే తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్(17405), ఆదిలాబాద్ - తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్(17406)ను రద్దు చేసినట్లు వెల్లడించారు. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సీసీఐ శ్రీనివాస్ తెలిపారు.

భద్రాచలానికి ఎన్డీఆర్ఎఫ్ బలగాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి మిచౌంగ్ తుపాన్ ప్రభావం ఉన్న నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్ ఎస్ఐ నాగేంద్రసింగ్ యాదవ్‌తో పాటు 20 మంది సభ్యులు మంగళవారం చేరుకున్నారు. వారితో పాటు డీఆర్ఎఫ్ బృందానికి చెందిన ఎస్ఐలు శ్రీనివాస్, సుమంత్, మరో 10 మంది సభ్యులు కూడా వచ్చారు. అవసరమైన సామగ్రిని స్థానిక పోలీస్ అధికారులకు అందజేసి, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.

వొకేషనల్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ వొకేషనల్ కోర్సుల్లో 2017లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంవత్సరం పాటు క్లినికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.సులోచనరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, చర్లలోని టీవీవీపీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిక్షణ ఇస్తామని వివరించారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు ఆయా ఆస్పత్రుల పేరుతో రూ.1000 డీడీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసి శిక్షణకు వెళ్లలేని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు బయోడేటా ఫారంతో పాటు రూ.10 పోస్టల్ స్టాంప్ జత చేసిన కవర్‌ను ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కూనంనేని



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కూనంనేని తదితరులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణకు కాబోయే సీఎం రేవంత్‌రెడ్డిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ సమితి సభ్యులు చాడ వెంకటరెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో కష్టపడి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, ఇదే రీతిన అన్ని పార్టీలను కలుపుకుని రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని ఆకాంక్షించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

పోలీసుశాఖకు చేదోడు, వాదోడు



కవాతు చేస్తున్న హోంగార్డు ఆఫీసర్లు (ఫైల్)

- హోంగార్డుల ఆఫీసర్ల సేవకు సలాం
- జిల్లాలో 595 మంది విధులు
- నేడు హోంగార్డుల దినోత్సవం

ఖమ్మంక్రైం: పోలీసు శాఖకు అనుబంధంగా.. వారితో సమానంగా హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీసులతోపాటు శాంతిభద్రతల పరిరక్షణలో కష్టపడే హోంగార్డులు అందరికీ సుపరిచితమే. ఈ నేపథ్యాన వారి సేవలకు గుర్తింపుగా ఏటా డిసెంబర్ 6వ తేదీన హోంగార్డు రైజింగ్ డే నిర్వహిస్తారు. కాగా, పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తించే తమకు యూనిఫాం అలవెన్స్‌లు, వీక్లీ ఆఫ్‌లు, ఉద్యోగ భద్రత లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమ సమస్యలను పట్టించుకోవాలని కోరుతున్నారు.

1850లో..

సాధారణంగా సైన్యం పోరాటం చేసే ప్రాంతాల్లో ఉన్నప్పుడు స్థానిక రక్షణ, గృహ రక్షణ కోసం స్వచ్ఛందంగా హోంగార్డులు ప్రజలకు సేవలు అందిస్తుంటారు. 1850లో హోంగార్డు అనే పదం వాడుకలోకి వచ్చింది. హోంగార్డు వ్యవస్థ ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. భారత ప్రభుత్వం మార్చి 1959లో స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 1963లో పోలీసులకు సహాయకులుగా వ్యవహరించేందుకు హోంగార్డు వ్యవస్థను తీసుకొచ్చారు. మొదట్లో ఈ సంస్థకు ఎన్‌రోల్‌మెంట్ ప్రభుత్వ సేవకుల నుంచి తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ తరువాత హోంగార్డుల ఆర్గనైజేషన్‌లో చేరే సదుపాయాన్ని కల్పించారు.

శాంతిభద్రతల్లో కీలకపాత్ర

ఖమ్మం జిల్లాలో 595 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. ఇందులో 66మంది మహిళలు కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పనితీరు కీలకంగా మారింది. పోలీసులతో సమానంగా వీరు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు సైతం బందోబస్తుకు వెళ్లారు. ఇక పోలీస్ స్టేషన్, రాజకీయ నాయకుల బందోబస్తుతోపాటు భారీ బహిరంగ సభల వద్ద శాంతిభద్రతలను కాపాడే విషయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఎండా, వాన, చలిని తట్టుకుని ఏసమయమైనా విధులో చేరి అలుపెరుగకుండా విధులు నిర్వర్తించే తాము ఎదుర్కొంటున్న సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పర్మనెంట్ చేయాలి



తెలంగాణ రాష్ట్రంలో 17వేల మంది హోంగార్డ్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. ఇన్నాళ్లుగా మేం చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలి. మమ్ముల్ని రెగ్యులర్ ఎంప్లాయిగా గుర్తించి పర్మినెంట్ చేయాలి. అలాగే,మిగతా సమస్యలు కూడా పరిష్కరించడంపై దృష్టి సారించాలి.

– రఫీ, హోంగార్డ్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



రాష్ట్రంలో హోంగార్డులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలి. ఈసారి హోంగార్డ్‌ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలనుకున్నా భారీ వర్షం కారణంగా ఆ పరిస్థితి కనిపించడం లేదు.

– వెంకటేశ్వర్లు, హోంగార్డ్ కమాండెంట్

సమస్యలు పరిష్కరించాలి



హోంగార్డు ఆఫీసర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలి. వేతన సవరణ చేయడమే కాక ఇతర సమస్యలపైనా దృష్టి సారించాలి. మాకు ఉద్యోగ భద్రత కూడా కల్పించాలి. అహర్నిశలు విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులను ఆదుకోవాలి.

– దామెర రవి, హోంగార్డు

మినీ పోలీసులుగా గుర్తించండి



రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరనున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి హోంగార్డులను మినీ పోలీసులుగా గుర్తించాలి. అలాగే, మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అందరూ నిరుపేదలే అయినందున ఇండ్ల స్థలాలు మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలి.

– ఖాదర్, హోంగార్డు

కారుణ్య నియామకాలు కల్పించాలి



ఎక్కడైనా హోంగార్డ్ మృతి చెందితే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కారుణ్య నియామకాలు చేపట్టాలి. మా కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తే ఆదుకున్నట్లవుతుంది. అలాగే, మృతి చెందిన హోంగార్డులు, రిటైర్డ్ అయిన వారికి ఆర్థికసాయం అందించాలి.

– ఉషారాణి, హోంగార్డ్



పొంచి ఉన్న పిడుగుపాటు

- తుపాను వేళ జాగ్రత్తలు తప్పనిసరి
- అన్నదాతలకు సూచనలు చేసిన వ్యవసాయ శాఖ

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి వైపరీత్యాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వరదలు, శీతల గాలులు, వడగాలులు, వడగండ్లు, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం తుపాను కారణంగా సోమవారం మొదలైన వాన మంగళవారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. ఈ సమయాన పిడుగులు కూడా పడే అవకాశముందని తెలుస్తోంది. అయితే, పంటలను కాపాడుకునేందుకు పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.విజయనిర్మల వెల్లడించిన సూచనలు ఇలా ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఆరుబయట ఉన్న వారు వర్షం మొదలుకాగానే ఇల్లు, చుట్టూ మూసి ఉన్న పాకల్లో ఆశ్రయం పొందాలి. చెట్లకు పిడుగును ఆకర్షించే గుణం ఉన్నందున చెట్ల కింద కింద నిలబడవద్దు. సమీపాన ఇల్లు, పాకలు లేకపోతే ఎత్తుగా ఉన్న వాటి నుంచి రెండింతల దూరంగా వెళ్లి మెరుపులు వచ్చినప్పుడు మోకాళ్లను ఛాతికి ఆనుకునేలా కూర్చోవాలి. ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు ఇంట్లోనే ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదు. అగ్నిమాపకాలు, రేడియేటర్లు, పొయ్యి, ఇనుప వస్తువులు, నీటి తొట్టి, ఫోన్ల వాడకం వంటి వాటికి, ఇతర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి. జలాశయాల వద్దకు వెళ్లిన వారు బయటకు రావాలి. ఉరుములు వస్తున్నపడు ఆరుబయట స్నానం చేయొద్దు. విద్యుత్ చార్జీ అనుభూతి ఎదురైనా, వెంట్రుకలు నిక్కపొడుచుకోవటం, ఒళ్లు జలదరించటం అనిపిస్తే కొన్ని క్షణాల్లో పిడుగుపడే అవకాశమున్నట్లు గుర్తించి నేలపై కూర్చుంటే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. అలాగే, 'దామిని' యాప్ ద్వారా ఉరుములు, మెరుపులు సంభవించే సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఇవి చేయొద్దు..

మనం ఉన్న ప్రదేశాన్ని జీపీఎస్ ద్వారా తెలుసుకొని తగిన జాగ్రత్తలు పాటించాలి. ఫోన్లు, ఇస్త్రీ పెట్టెలు, ఇతర వస్తువులకు చార్జింగ్ పెట్టరాదు. ఆ సమయంలో ఇంటి ఆవరణలో పిడుగు పడితే షాక్ కొట్టే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు సంభవిస్తున్నప్పుడు టెలిఫోన్ వాడొద్దు. టెలిఫోన్ తీగలపై పిడుగు పడితే మాట్లాడేవారికి షాక్ తగిలే అవకాశం ఉంది. బయట ఉన్న ఇనుప పనిముట్లు, వ్యవసాయ పనిముట్లు ఇతర లోహాలను వాడరాదు.

పిడుగుపాటుకు గురైతే..



ఎం.విజయనిర్మల

ఎవరైనా పిడుగుపాటుకు గురైతే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఒకవేళ వ్యక్తికి ఊపిరి ఆగినట్లయితే వెంటనే నోటిలో నోరు పెట్టి ఊపిరి అందించాలి. గుండె కొట్టుకోవటం ఆగినట్లయితే సీపీఆర్ చేయాలి. పిడుగుపాటుకు గురైన వ్యక్తి ఊపిరి పీల్చుకోవటం, గుండె కొట్టుకోవటం సాధారణంగా ఉంటే, ఇతర శరీర భాగాలు దెబ్బతిన్నాయా, లేదా అని పరిశీలించాలి. అలాగే, శరీరంలో పిడుగు ఎక్కడ దిగింది, ఎక్కడైనా కాలిందా.. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందా.., లేదా? ఎముకలు ఎక్కడైనా విరిగాయా తదితర అంశాలను పరిశీలించి సరైన చికిత్స చేయించాలి.

ముగిసిన ఎన్నికల కోడ్

- ఎన్నికల వేళ భద్రాద్రి జిల్లాలో రూ.3.29 కోట్లు పట్టివేత
- అభివృద్ధి పనులకు తొలగిన అడ్డంకులు



ఎన్నికల వేళ వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

చుంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ ఎత్తివేసింది. తెలంగాణలో అక్టోబర్ 9న అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయగా ఆ రోజు మొదలు ఈ నెల 4 (సోమవారం) వరకు అనగా సుమారు రెండు నెలలపాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. జిల్లా యంత్రాంగం ఎన్నికల వేళ పకడ్బందీగా నియమావళిని వర్తింపజేస్తూ వచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత రూ.50 వేలకు పైగా నగదు తరలించవద్దని ఆదేశాలు అమలు చేశారు. రూ.50 వేలకు పైగా తరలించే వ్యక్తుల నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక చెక్‌పోస్టులు, నిఘా విభాగాల ద్వారా ఎక్కువ మొత్తంలో నగదు, మద్యం, ఇతర వస్తువులను తరలిస్తున్న వారిని ఎన్నికల స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుభకార్యాలకు వస్తువులు, ఇతర సామగ్రి కొనుగోలు, రైతులు ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం సైతం నగదు తీసుకెళ్తుండగా సరైన పత్రాలు చూపించకపోవడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో సాధారణ ప్రజలు, రైతులు, వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇక వివాహాది శుభ కార్యాలయాలకు బంగారం కొనుగోలు చేయాలనుకున్నా రు.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్లాల్సి రావడంతో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సరైన ధ్రువపత్రాలు లేవన్న కారణాలతో జిల్లాలో రూ.3.29 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. ఆ తర్వాత సరైన పత్రాలు, ఆధారాలు చూపడంతో ఎన్నికల అధికారులు నిబంధనల మేరకు తిరిగి బాధితులకు అప్పగించారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి వంటివి పూర్తి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలను ఎలక్షన్ కమిషన్ సోమవారం ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అధికార యంత్రాంగం ఎప్పటిలాగే సాధారణ కార్యకలాపాలపై దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. ఎన్నికల విధుల నుంచి తేరుకొని అధికారులు అంతా తిరిగి తమ రోజువారి కార్యకలాపాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఆంక్షలు అధికారులు పూర్తిగా ఎత్తివేశారు. దీంతో సామాన్యులతో పాటు వ్యాపారులు నగదును తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది

వ్యాపార వర్గాల అవస్థలు

అసెంబ్లీ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సందర్భంగా అన్ని రకాల వ్యాపార వర్గాలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా హోటళ్లు, వైన్స్, బార్లు, రెస్టారెంట్లు, ఫర్టిలైజర్ దుకాణాలు, మందుల దుకాణాలు వంటివి సాధారణంగా రాత్రి వరకు కొనసాగుతాయి. జిల్లాలో కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో వ్యాపార లావాదేవీలు అధికంగా జరుగుతుంటాయి. అక్టోబర్ 9 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే పలువురు నగదును తరలించే సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ అవసరాల నిమిత్తం ఇతరులకు చెల్లించాలన్నా, ఇతరుల నుంచి డబ్బులను తీసుకోవాలన్నా కొంతమేర భయపడ్డారు. ఎన్నికల నియమాళి ప్రకారం రాత్రి 10 గంటల వరకే వ్యాపారాలు చేసుకోవాలని చెప్పడంతో కొంతమేర వ్యాపారాలు సైతం దెబ్బతిన్నట్లు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం జిల్లా సరిహద్దులు, ఇతర కీలక ప్రాంతాల్లో మొత్తం 15 ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీం) చెక్‌పోస్టులను అధికారులు ఏర్పాటు చేశారు. మరో 16 ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్), 21 వీఎస్‌టీ (వీడియో సర్వైలెన్స్ టీమ్స్), మరో ఐదు వీవీటీ (వీడియో వీవింగ్ టీమ్) అందుబాటులో ఉంచారు. వీటిని వివిధ శాఖల సమన్వయంతో నిర్వహిస్తూ 24 గంటలూ నిఘా పెట్టారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నియామావళి ఎత్తి వేయడంతో వీటన్నింటిని వెంటనే తొలగించారు. ఇక జిల్లాలో 165 కేసులను నమోదు చేసి వారి నుంచి రూ.3.29 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు పట్టుబడిన వాటిలో సరైన ఆధారాలను చూపించగా 160 కేసులకు పరిష్కారం చూపి రూ.2.97 కోట్లను తిరిగి వారికి ఇచ్చేశారు. మరో ఐదు కేసులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఎన్ని కోడ్ ఎత్తివేయడంతో సామాన్య ప్రజలతో పాటు వ్యాపార వర్గాలు ఊపిరి పీల్చుకున్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సూచించారు. ఢిల్లీలో ఉన్న మంగళవారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి తుపాన్ ప్రభావంపై ఆరా తీశారు. అలాగే, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

సహాయక చర్యలు చేపట్టండి

మధిర/ఖమ్మం వన్‌టౌన్: తుపాన్ నేపథ్యాన అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని మధిర, పాలేరు, ఖమ్మం ఎమ్మెల్యేలు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం వారు ఫోన్‌లో అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మరో 48 గంటలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యాన ప్రజలు ప్రమాదం బారిన పడకుండా సూచనలు చేయాలని, అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

టీఎన్జీవోస్ కార్యాలయంపై దాడికి నిరసన



టీఎన్జీవోస్ కేంద్ర నాయకులతో అఫ్జల్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంపై దాడి చేయడమే కాక అధ్యక్షుడు అఫ్జల్ హసన్ తదితరులపై భౌతికి దాడికి యత్నించడం గర్హనీయమని యూనియన్ బాధ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వివిధ శాఖల్లోని టీఎన్జీఓ సంఘం ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయడమే కాక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్‌కు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కాగా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, సాగర్ తదితరులు హైదరాబాద్‌లో కేంద్ర నాయత్వాన్ని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా దాడి వివరాలు, ఇందుకు దారి తీసిన పరిస్థితులను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నందగిరి శ్రీను, కార్యదర్శి జీ.ఎస్ ప్రసాద్, సవర్జన్ పాల్, వై.శ్రీనివాసరావు, పాషా, సుధాకర్ తదితరులు ఉన్నారు.

జానారెడ్డిని కలిసిన తుమ్మల



జానారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

ఖమ్మంవన్‌టౌన్: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డిని ఖమ్మం ఎమ్మెల్యే, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని నివాసంలో జానారెడ్డిని కలిసిన తుమ్మల పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కాగా, జానారెడ్డి సైతం భారీ మెజార్టీతో గెలిచిన తుమ్మలను అభినందించారు.

రేవంత్‌ను కలిసిన రాగమయి

సత్తుపల్లి: సీఎల్పీ నేతగా ఎన్నికైన రేవంత్‌రెడ్డిని సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ మట్టా రాగమయి కలిశారు. తన భర్త, మట్టా దయానంద్‌తో పాటు రేవంత్‌ను కలిసిన ఆమె సీఎల్పీ నేతగా ఎన్నికవడంపై శుభాకాంక్షలు తెలిపారు.

దాడి, బెదిరింపులపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: దాడి చేయడమేకాక చంపుతామని బెదిరించిన తండ్రీకొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. నగరంలోని పాండురంగాపురానికి చెందిన కేబుల్ ఆపరేటర్ కె.సురేష్‌కుమార్ కుమారుడి వద్ద అదే గ్రామానికి చెందిన జి.అజయ్ పద్నాలుగు నెలల క్రితం రూ1.16లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో పది నెలల క్రితం అజయ్ తన కారును సురేష్‌కు అప్పగించి డబ్బు కట్టాక తీసుకెళ్తానని చెప్పాడు. కాగా, సోమవారం ఆయన ఫోన్‌చేసి పాండురంగాపురంలోని టీ కొట్టు వద్దకు రావాలని సూచించగా, సురేష్ వెళ్లడంతో అజయ్, ఆయన తండ్రి రత్నం దూషించడంతోపాటు సురేష్‌తో పాటు అయన కుమారుడిని చంపుతామని బెదిరించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అశ్వాపురం: వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్‌వైరును అపహరించారు. ఈ ఘటన రెండు రోజుల కిందట చోటుచేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైనట్లు గుర్తించిన రైతులు మాట్లాడుతూ.. పోలీసులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం, మోటార్ల చోరీపై దృష్టి సారించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

పాల్వంచ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని నాగారంలో రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా చేసే 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని రూ.10 వేల విలువ చేసే కాపర్ వైరును చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని ఏఈ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

పాల్వంచ: రాళ్లు విసిరి తల పగులగొట్టిన ఇద్దరు వ్యక్తులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. మండలంలోని యానంబైల్ గ్రామానికి చెందిన కంటెం ప్రవీణ్‌కుమార్, బొశెట్టి వినయ్ ఈ నెల 3వ తేదీన అదే గ్రామానికి చెందిన బల్దే రాంబాబుపై పాత కక్షల నేపథ్యంలో రాళ్లు విసిరారు. దీంతో రాంబాబుకు తలపగిలింది. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రవీణ్‌కుమార్, వినయ్‌పై కేసు నమోదు చేశారు. కాగా, రాంబాబు బీర్ సీసాతో ప్రవీణ్‌కుమార్‌పై దాడి చేయడంతో కేసు నమోద్ అయిన విషయం విదితమే.

ప్రమాద నిర్లక్ష్యాన్ని ప్రయాణికుడికి ఎలా ఆపాదిస్తారు?

బాధిత కుటుంబానికి రూ.29 లక్షలను వడ్డీతో చెల్లించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్న వ్యక్తి మరణిస్తే, అతనికి నిర్లక్ష్యాన్ని ఎలా ఆపాదిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. దీన్ని కారణంగా పేర్కొంటూ మృతుడి కుటుంబసభ్యులకు చెల్లించాల్సిన పరిహారాన్ని తగ్గించడం చెల్లదని, ట్రిబ్యునల్ ఉత్తర్వులు సరికాదని స్పష్టం చేసింది. పరిహారం మొత్తం రూ.29 లక్షలను వడ్డీతో సహా చెల్లించాలని న్యూఇండియా అస్యూరెన్స్ సంస్థను ఆదేశించింది. రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందారని, ప్రమాద బీమా పరిహారాన్ని తగ్గిస్తూ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మెదక్‌కు చెందిన ఎ.సత్యవతి మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ పి.శ్యాంకోషి, జస్టిస్ ఎస్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్లకు రూ.29 లక్షల్లో కొంత మొత్తం పరిహారం ఇప్పటికే చెల్లించి ఉంటే దానిని మినహాయించి మిగిలిన మొత్తానికి గత పదేళ్లుగా వడ్డీ జమ చేసి చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. పిటిషనర్ భర్త సుబ్బారావు కారులో 2013లో మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వస్తుండగా రోడ్డు పక్కన వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని, ఆ ప్రమాదంలో ఆయన మరణించారని పిటిషనర్ న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు. ప్రమాదానికి కారులో ఉన్న వారు కూడా కారణమని చెప్పి పరిహారం రూ.29 లక్షల్లో సగమే చెల్లించాలని ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చిందన్నారు. పిటిషనర్ భర్త డ్రైవర్ పక్కన కూర్చున్నారని, ప్రమాదానికి అతడెలా కారణమవుతారని ప్రశ్నించారు. బీమా సంస్థ తరఫు న్యాయవాది ప్రతివాదన చేస్తూ, కారు డ్రైవర్, సుబ్బారావు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ట్రిబ్యునల్ తేల్చిందన్నారు. వాదనల తర్వాత ట్రిబ్యునల్ ఇచ్చిన నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇరుపక్షాల నిర్లక్ష్యం ఉందని చెప్పి పరిహారాన్ని సగానికి తగ్గింపు చెల్లదని తేల్చి చెప్పింది.

వాళ్లు ఓడిపోవడం ఏమిటో?

- ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేల ఓటమిపై కమలదళంలో విస్మయం!
- బండి, ఈటల, అర్వింద్, రఘునందన్‌రావు, సోయం పరాజయం పెద్ద దెబ్బే
- పని చేయని బీసీ సీఎం నినాదం
- బండి టార్గెట్‌గా బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు
- బీజేపీ కీలక నేతల ఓటమిపై పార్టీ వర్గాల విశ్లేషణ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పక్కాగా గెలిచి సత్తా చాటుతారని భావించిన ముఖ్యనేతలే ఓటమి చవిచూడడంపై బీజేపీలో విస్మయం వ్యక్తమవుతోంది. పోటీచేసిన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పరాజయం పాలు కావడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించు కోలేకపోతున్నారు. కరీంనగర్ ఎంపీగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ప్రజల్లో అత్యంత ప్రజాకర్షణ కలిగిన నాయకుల్లో ముఖ్యుడైన బండి సంజయ్, ఒకప్పుడు బీఆర్ఎస్‌లో నంబర్‌–టుగా వెలిగి, ఇప్పటిదాకా ఓటమి ఎరగని ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవితపై గెలిచి సంచలనం సృష్టించిన ధర్మపురి అర్వింద్, ఫైర్‌బ్రాండ్ నేతగా గుర్తింపు పొంది దుబ్బాక ఉప ఎన్నికల్లో అందరి అంచనాలు తలకిందులు చేసిన రఘునందన్‌రావు, ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు ఓడిపోవడానికి కారణాలు ఏమై ఉంటాయా అన్న చర్చ పార్టీలో విస్తృతంగా సాగుతోంది.

పని చేయని బీసీ నినాదం

బీజేపీ బీసీ నినాదం, ఇతర పార్టీల కంటే అత్యధికంగా 36 సీట్లు బీసీలకు కేటాయించిన నేపథ్యం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే పార్టీ విధానపరమైన నిర్ణయం... ఈ ఎన్నికల్లో కనీసంగా పనిచేయలేదని విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఎనిమిది మందిలో ముగ్గురు మాత్రమే బీసీలు ఉండటం, బీసీ సీఎం అభ్యర్థులుగా ముందువరుసలో నిలిచే సంజయ్, ఈటల, అర్వింద్ ఓటమి పాలవడం చూస్తుంటే బీసీ ప్రభావం ప్రశ్నార్థకంగానే ఉందని అంటున్నారు.

సంజయ్‌ను ఓడించేందుకు...

రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరై, బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నంత స్థాయిలో పార్టీ ఇమేజ్‌ని అమాంతం పెంచిన నేతగా గుర్తింపు పొందిన బండి సంజయ్ ఓటమికి పైకి కనిపించని కారణాలు ప్రభావితం చేసినట్టు అంచనా వేస్తున్నారు. కరీంనగర్ ఫలితాన్ని పోలింగ్ బూత్‌ల వారీగా విశ్లేషించిన పార్టీ నేతలు ముస్లిం, మైనారిటీ ఓటర్లు ఏకపక్షంగా సంజయ్‌కు వ్యతిరేకంగా ఓటేశారని లెక్కలు వేస్తున్నారు. ఎలాగైనా సంజయ్‌ను ఓడించాలంటూ పోలింగ్ సమయం నాటికి బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ మిలాఖత్ అయిందని ఆరోపిస్తున్నారు. మొత్తం 390 పోలింగ్ బూత్‌లలో దాదాపు 200 బూత్‌లలో సంజయ్ ప్రత్యర్థి గంగుల కమలాకర్ కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. మిగిలిన 186 బూత్‌లలోనే బీఆర్ఎస్ అభ్యర్థి అధిక ఓట్లు సాధించగలిగారు. ఈ నియోజకవర్గంలో ఉన్న 62 ముస్లిం ఓటర్ల ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక ఓట్లు గంగులకే పడ్డాయి. ఉదాహరణకు చూస్తే హుస్సేన్ పురాలోని 232 నుంచి 241 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 80 శాతానికిపైగా మైనారిటీ ముస్లిం ఓటర్లుండగా, వీటిలో పోలైన 6,764 ఓట్లలో సంజయ్‌కు కేవలం 259 మాత్రమే పడ్డాయి. ఈ బూత్‌లలో 4,979 ఓట్లు అంటే 80 శాతం కమలాకర్‌కు పడ్డాయి. సంజయ్ 3,163 ఓట్లతో వెనకబడడం చూస్తే...ఈ ఓట్లే సంజయ్ ఓటమిని శాసించాయని గణాంకాలతో సహా పార్టీ నాయకులు ఉదహరిస్తున్నారు. ఇక ముస్లిం ఓటర్ల ప్రాబల్యమున్న 62 పోలింగ్ బూత్‌లలో ఒక్కటంటే ఒక్క పోలింగ్ బూత్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత కనబరచకపోవడం చూస్తే కమలాకర్‌తో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలకు బలం చేకూరుతోందని విశ్లేషిస్తున్నారు. ప్రజల కోసం నిత్యం పోరాడే తనను ఓడించేందుకు ముస్లింలంతా ఏకమయ్యారని, హిందూ సమాజం ఇప్పటికైనా కళ్లు తెరవాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా దీనినే స్పష్టం చేస్తున్నాయని చెబుతున్నారు.

అంతటా తిరగడం వల్లనే ఈటలకు నష్టం

కేసీఆర్‌ను గజ్వేల్‌లో పోటీచేసి ఓడిస్తానంటూ ఈటల రాజేందర్ సవాల్ విసిరి బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. తన సిట్టింగ్ స్థానం హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లోనూ పోటీ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఈటలకు వ్యక్తిగతంగా నష్టం చేసిందని అంచనా వేస్తున్నారు. వరుసగా గెలుస్తూ వచ్చిన హుజూరాబాద్‌లో ఈ సారి త్రిముఖ పోటీ కారణంగా ప్రజా వ్యతిరేకత ప్రాతిపదికన కాంగ్రెస్ అధిక ఓట్లు చీల్చడంతో ఈటల అనూహ్యంగా ఓటమి పాలు కావాల్సి వచ్చిందని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

ఆత్మహత్యల్లో 6.6% అన్నదాతలవే!

- గతేడాది దేశవ్యాప్తంగా 5,207 మంది రైతుల బలవన్మరణం
- 6,083 మంది కౌలు రైతు, వ్యవసాయ కూలీలు కూడా..
- 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో మాత్రం తగ్గిన రైతు ఆత్మహత్యలు
- గతేడాది దేశంలో ఉసురుతీసుకున్న 1,70,924 మంది ప్రజలు
- జాతీయ నేర గణాంకాల బ్యూరో–2022 నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అన్నదాతల ఆత్మహ్యతలు మాత్రం తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా నమోదైన అన్ని రకాల ఆత్మహత్యల్లో 6.6 శాతం మంది వ్యవసాయ రంగానికి చెందినవారే ఉండటం గమనార్హం. 2022లో దేశవ్యాప్తంగా అన్ని రకాల కారణాలు కలిపి 1,70,924 మంది ప్రజలు ఆత్మహత్య చేసుకోగా అందులో 5,207 మంది రైతులతోపాటు మరో 6,083 మంది కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2021తో పోలిస్తే 2022లో దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి చెందిన వారి ఆత్మహత్యల్లో 3.75 శాతం నమోదైనట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2022 నివేదిక తెలిపింది. 2021లో వ్యవసాయ రంగానికి చెందిన 10,881 మంది ఆత్మహత్య చేసుకోగా 2022లో 11,290 మంది ఉసురు తీసుకున్నారు.



దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయరంగ కూలీల ఆత్మహత్యలు..

ఏడాది	మొత్తం ఆత్మహత్యలు
2018	10,349
2019	10,281
2020	10,677
2021	10,881
2022	11,290

రాష్ట్రంలో తగ్గిన రైతు ఆత్మహత్యలు..

ఈ నివేదిక ప్రకారం 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. 2021లో రాష్ట్రంలో 303 మంది రైతు ఆత్మహత్యలు నమోదవగా 2022లో 178 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలో కౌలు రైతులు, వ్యవసాయ రంగం ఆధారిత కూలీల మరణాలు నమోదు కాలేదని నివేదిక వెల్లడించింది.

పెరిగిన రోడ్డు ప్రమాద మృతులు...

దేశవ్యాప్తంగా 2021లో జరిగిన అన్ని రకాల ప్రమాదాల్లో 3,97,530 మంది మృతిచెందగా 2022లో ఆ సంఖ్య 4,30,504కు చేరింది. ఆయా ప్రమాదాల్లో మృతిచెందిన వారిలో 30 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారు 30.9 శాతం (1,32,846 మంది) ఉండగా 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వారు 24.9 శాతం (1,07,244 మంది) ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. గతేడాది మొత్తం 4,46,768 రోడ్డు ప్రమాదాలు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 1,71,100 మంది మృతిచెందగా 4,23,158 మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాద బాధితుల్లో అత్యధికంగా 45.5 శాతం మంది ద్విచక్రవాహనదారులే కావడం గమనార్హం. అత్యధిక రోడ్డు ప్రమాదాలు అతివేగం కారణంగానే జరిగాయని నివేదిక తెలిపింది. అతి వేగం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,00,726 మంది దుర్మరణం చెందగా 2,72,661 మంది గాయపడ్డారు. 2021తో పోలిస్తే తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు 1.4% మేర పెరిగాయి. 2021లో రాష్ట్రంలో మొత్తం 21,315 రోడ్డు ప్రమా దాలు జరగ్గా 2022లో 21,619 రోడ్డు ప్రమాద ఘటనలు నమోదయ్యాయని నివేదిక వెల్లడించింది. 2022లో రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన రోడ్డు ప్రమాదాల్లో 7,559 మంది మృతిచెందినట్లు తెలిపింది.

'ఉచిత ప్రయాణానికి' ఏర్పాట్లు!

- బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీపై కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చిన దరిమిలా ఆ మేరకు ఆర్టీసీ లెక్కలు
- కర్ణాటకలో అమలవుతున్న తీరును అధ్యయనం చేయనున్న టీఎస్ ఆర్టీసీ అధికారులు
- నలుగురు సభ్యుల బృందం బెంగళూరుకు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఏయే కేటగిరీ బస్సుల్లో అమలు చేస్తే ఎంత భారం పడనుందనే విషయంలో ఆర్టీసీ అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ పథకం ఎలా అమలవుతోంది, అక్కడ ఎంత ఖర్చవుతోంది, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా సర్దుబాటు చేస్తోంది.. అన్న విషయాలను పరిశీలించేందుకు నలుగురు ఆర్టీసీ అధికారుల బృందం బెంగళూరుకు వెళ్తోంది. రెండు రోజుల పాటు అక్కడ పరిశీలించి నివేదికను సిద్ధం చేయనుంది. అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి రావటంతో అధికారులు పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం కొలువుదీరబోతోంది. దీంతో వీలైనంత తొందరలో ఈ పథకం అమలు చేసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి అడిగిన వెంటనే నివేదిక అందజేసేందుకు వీలుగా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కూడా అమలు చేస్తే..

దక్షిణాదిలో తొలుత తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించారు. కానీ అక్కడ, కేవలం నగర, పట్టణ ప్రాంతాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఈ వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా గులాబీ రంగులో ఉండే బస్సులను అందుబాటులోకి తెచ్చారు. వాటిల్లోనే ఈ వెసులుబాటు ఉంటుంది. కానీ, కర్ణాటకలో మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఈ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని ప్రకటించింది. అధికారంలోకి రావటంతో దాన్ని అమలులోకి తెచ్చింది. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ కర్ణాటక మోడల్‌ను అనుసరిస్తుందా, తమిళనాడు మోడల్‌ను చేపడుతుందా అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. కర్ణాటక తరహాలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్లు అవుతుంది. పల్లెవెలుగు బస్సులకే పరిమితం చేస్తే ఏటా రూ.750 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు.



ప్రభుత్వం ఇవ్వాల్సింది ప్రతినెలా దాదాపు రూ.185 కోట్లు ..

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైతే, ఆ రూపంలో ఆర్టీసీ కోల్పోయే టికెట్ ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల వరకు ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్ల వరకు రీయింబర్స్ చేయాలి. అంటే ప్రతి నెలా రూ.185 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది.

జీరో టికెట్ ప్రవేశపెడతారా..?

ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నది లెక్క తేలాల్సి ఉంటుంది. ఇందుకోసం కర్ణాటకలో జీరో టికెట్ విధానం ప్రారంభించారు. మహిళలకు రూ.సున్నా అని ఉండే జీరో టికెట్‌ను జారీ చేస్తారు. అలా రోజుకు ఎన్ని టికెట్లు జారీ అయ్యాయో నమోదు చేసి నెలవారీగా లెక్కిస్తారు. ఇక్కడ అదే పద్ధతి ప్రవేశపెడతారా లేక మరో విధానాన్ని అనుసరిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

జిల్లా వార్తలు

నేడు, రేపు ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: తుపాను కారణంగా బుధ, గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. తుపాను నేపథ్యాన జిల్లాలో రెడ్ ఎలర్ట్ ప్రకటించగా, రైతులు, కొనుగోలుదారులకు ఇబ్బంది తలెత్తకుండా చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యుల వినతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు పంట ఉత్పత్తులను రెండు రోజుల పాటు మార్కెట్‌కు తీసుకురావొద్దని కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల పరిశీలకుడిగా ప్రేమ్‌కుమార్


ప్రేమ్‌కుమార్

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా కొత్తగూడెంనకు చెందిన జాతీయ క్రీడాకారుడు ప్రేమ్‌కుమార్ ఎంపిక య్యారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి రామిరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పర్యవేక్షకుడిగా వ్యవహరించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయజట్టుకు ఎంపిక చేయడంలో ప్రధాన భూమిక పోషించనున్నారు. ప్రస్తుతం పాల్వంచ జెడ్పీహెచ్ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్‌ను భద్రాద్రి, ఖమ్మం జిల్లాల డీఈఓలు ఎం.వెంకటేశ్వరాచారి, ఈ.సోమశేఖరశర్మ అభినందించారు.

బొగ్గు గని కార్మికుల సీఎంపీఎఫ్ రికార్డులు కంప్యూటరీకరణ

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గుగని కార్మికులకు సంబంధించి సీఎంపీఎఫ్ రికార్డులను కంప్యూటీకరించినట్లు సింగరేణి జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. సీఎంపీఎఫ్ కమిషనర్ వీకే మిశ్రా మంగళవారం కోలిండియా అనుబంధ బొగ్గు సంస్థల అధికారులు, సీఎంపీఎఫ్ అధికారులతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సింగరేణి నుంచి జీఎం బసవయ్య మాట్లాడుతూ కార్మికుల ఖాతా వివరాలను కంప్యూటరీకరించామని, వివరాలను www.cmpfo.gov.in వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవచ్చని తెలిపారు. అలాగే, వచ్చే ఏడాది జనవరి నుంచి ఉద్యోగ విరమణ చేసే వారి సీఎంపీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌లను ఆన్‌లైన్ ద్వారా సెటిల్ చేస్తామని చెప్పారు. వీసీలో అధికారులు కె.శ్రీనివాసరావు, ముకుంద సత్యనారాయణ, పి.రాజేశ్వరరావు, వేణుగోపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిటౌన్/మణుగూరుటౌన్/టేకులపల్లి: తుపాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం సాయంత్రం మొదలైన వాన మంగళవారం కూడా కొనసాగింది. ఈ కారణంగా సింగరేణిలోని కొత్తగూడెం రీజియన్‌లో సుమారు 51 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రీజియన్‌లోని కొత్తగూడెం ఏరియాలో రోజుకు 64 టన్నుల ఉత్పత్తికి గాను మంగళవారం 30 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. ఇల్లెందు ఏరియాలో 16 వేల టన్నులకు 10 వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 41 వేల టన్నులకు గాను 30 వేల ఉత్పత్తి నమోదైందని అధికారులు తెలిపారు. దీంతో రీజియన్‌లో 51 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లయింది. వర్షం కారణంగా క్వారీల్లోని డంపర్లు, డోజర్లు ఎక్కడికక్కడే నిలిచిపోయి. భారీగా వర్షపు నీరు నిలవడంతో సిబ్బంది బయటకు తొలగించడంలో నిమగ్నమయ్యారు.

కొత్తగూడెం రీజియన్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన


మణుగూరు ఓసీలో నిలిచిన నీరు

'ఉపా' చట్టాన్ని ఎత్తివేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: 'ఉపా' చట్టాన్ని ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై ప్రయోగించడం దుర్మార్గమని.. ఇకనైనా ఈ చట్టాన్ని రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఖమ్మంలో మంగళవారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ భారత్ బచావో జాతీయ నాయకుడు డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేష్‌పై ఉపా చట్టం కింద పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ప్రశ్నించే వారిపై ఈ చట్టాన్ని అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు. అన్ని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ అంశంపై పోరాడాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ కలిగి ఉండాల్సిన పరిస్థితుల్లో పాలకులు హక్కులను హరించివేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వమైన ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామిక హక్కులను కాపాడడాన్ని ఏడో గ్యారంటీని అమలు చేయాలని వారు కోరారు. అన్నారు. ఈసమావేశంలో సీసీపీ నాయకులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, స్పర్శ భాస్కర్‌తో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వై.విక్రమ్, ఆవుల అశోక్, సింగు నరసింహారావు, ఝాన్సీ, గుంతేటి వీరభద్రం, దేవిరెడ్డి విజయ్, టి.వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్

ఖమ్మంమామిళ్లగూడెం: ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్ పూర్తి చేసిన ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు టీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో వివరాలను ఈ నెల 20వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా అర్హులను ఎంపిక చేయనుండగా, ఖమ్మం రీజియన్‌లోని డిపోల్లో అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీతో దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా మోహన్‌కృష్ణ


అవార్డు అందుకున్న మోహన్‌కృష్ణ

దమ్మపేట: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో దమ్మపేట మండలం చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి కుర్సం మోహన్‌కృష్ణ విజేతగా నిలిచాడు. నవంబర్ 28 నుంచి మంగళవారం వరకు బెంగళూరులో జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు జరగగా ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో గెలుపొంది అవార్డు, ప్రశంసాపత్రంతో పాటు రూ.31 వేల నగదు బహుమతి అందుకున్నాడు. కాగా, మోహన్‌కృష్ణ చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతుండగా, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు అదే పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు పండితాపురం సంత బంద్

కామేపల్లి: కామేపల్లి మండలం పండితాపురంలో బుధవారం జరిగే వారాంతపు సంతను ఈ వారం బంద్‌చేస్తున్నట్లు కొమ్మినేపల్లి పంచాయతీ కార్యదర్శి నెహ్రూ ఓ ప్రకటనలో తెలిపారు. తుపాన్ కారణంగా వర్షాలు కురుస్తుండడమే కాక గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా పోలీసుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అమ్మకం, కొనుగోలుదారులు గమనించాలని కోరారు.

నేలను కాపాడితేనే పంటలకు ప్రాణం


అశ్వారావుపేటరూరల్ : ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యాన పరిశోధన సిబ్బంది


జూలూరుపాడు : మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

అశ్వారావుపేటరూరల్: పంటల సాగులో కీలకమైన నేలను కాపాడుకుంటే భూసారంతో పాటు దిగుబడులు పెరుగుతాయని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయకృష్ణ తెలిపారు. ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్‌బీఐ భాగస్వామ్యంతో కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ తర్వాత విజేతలకు బహుమతులు అందజేసిన హేమంత్‌కుమార్, విజయకృష్ణ మాట్లాడారు.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. అలాగే, పచ్చిరొట్ట వాడకంతోపాటు పంట మార్పిడి చేపడితే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ టి.కృష్ణ, ప్రొఫెసర్లు మూర్తి, రాంప్రసాద్, నాగాంజలి, జాంబమ్మ, స్రవంతి, రెడ్డిప్రియ, కృష్ణతేజ, జయమ్మ, ఏఈఓ హుస్సేన్, సిబ్బంది కట్టా సుబ్బారావు, నరేందర్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

జూలూరుపాడు: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా జూలూరుపాడు మండలం కరివారిగూడెంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతులందరూ నేల స్వభావాన్ని పరీక్షించుకుని పంటలు సాగు చేయాలన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేలా జీలుగ, పిల్లిపెసర, పెసర వంటి పచ్చిరొట్ట వేసుకోవాలని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు నవీన్, శ్రీనివాస్, కరివారిగూడెం సర్పంచ్ బోడా శాంతిరాం, ఏఈఓ బి.గోపీకృష్ణ పాల్గొన్నారు.

లారీ, ట్యాంకర్ ఢీ.. డ్రైవర్ మృతి


ఘటనా స్థలంలో వాహనాలు


క్యాబిన్ నుంచి డ్రైవర్ శివను బయటకు తీస్తున్న స్థానికులు

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ సమీపంలోని కల్లూరు రోడ్డులో మంగళవారం లారీ, ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న పాల ట్యాంకర్, తల్లాడ వైపు నుంచి కల్లూరు వెళ్తున్న బొగ్గు లారీ తల్లాడ పెట్రోల్ బంక్ సమీపాన ఢీకొన్నాయి. ఈఘటనలో ట్యాంకర్ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ జిందె శివ(36) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని స్థానికుల సహకారంతో జేసీబీతో క్యాబిన్‌ను పగులగొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. అప్పటికే కొన ఊపిరితో ఉన్న శివను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా మోతుకూరు మండలం కొడ్డిశేరు గ్రామ వాసి కాగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పల్లిపాడు వద్ద ప్రమాదం..

కొణిజర్ల: లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వరంగల్ నుంచి ఏపీలోని కాకినాడకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీని వైరా వైపు నుంచి వస్తున్న వ్యాన్ మండలంలోని పల్లిపాడు కోల్డ్‌స్టోరేజ్ వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. రోడ్డుపై గుంతలను తప్పించే క్రమంలో సదరు వ్యాన్ డ్రైవర్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో వ్యాన్ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.